# అదుగో పులి - పారిపో!

విన్నకోట సుశీలాదేవి

దాదాపుగా వారం రోజులనుండీ, ఆ ఇద్దరాడ వాళ్ల మధ్య ఆ గొడవ అవిరామంగా, అవిశ్రాంతంగా సాగుతూనే వుంది.

వారిద్దరి మధ్యా జగన్నాథం — రవి నలిగిపోతున్నారు.

జగన్నాథం కాలేజీ లెక్చరరు.

ఆ ఇద్దరాడవాళ్లల్లో ఒకరు అతని భార్య ప్రమీల మరొకరు ఆమెకు దూరపు బంధువు శాంతమ్మ.

రవి ప్రమీల పెంచుకోడానికి తెచ్చుకున్న శాంతమ్మ కొడుకు.

జగన్నాథానికి పెళ్లయి పదేళ్లయింది. అతడికి పిల్లల్లేరు. వారికి పిల్లలు పుట్టటం అసాధ్యమని తేల్చారు డాక్టర్లు! దానికి జగన్నాథంలో వున్న శారీరకలోపమే కారణం.

ఆ మాట విన్న జగన్నాథం చాలా బాధపడ్డాడు.

డాక్టరు జగన్నాథాన్ని ఓదార్చాడు. కృత్రిమమైన గర్భధారణకు ఈనాడెన్నో సాధనాలున్నాయని నచ్చచెప్పాడు. కానీ ప్రమీల ఒప్పుకోలేదు.

భార్య "పాతివ్రత్యానికి" పొంగిపోయాడు జగన్నాథం. అప్పటినుంచే ఎక్కువ అనురాగంతో ఆదరించసాగాడు.

ఒకరోజు ప్రమీల అంది.

"మనం ఎవరినైనా పెంచుకుందామండీ!"

ఆ మాట నచ్చింది జగన్నాథానికి.

"ప్రమీలా నీ ఆలోచన బాగుంది. ఈ దేశంలో అనాథలైన పిల్లలు ఎన్నోవేలమంది వున్నారు. ఒక్కరికైనా మనం ఆశ్రయం కల్పిద్దాం" జగన్నాథం వుత్సాహంగా అన్నాడు.

ప్రమీల ముఖం చిట్లించింది:

"ఎవరో కనిపారేసిన పిల్లల్ని పెంచే ఖర్మ మనకేం పట్టింది? వాళ్ల కులమేమిటో, మతమేమిటో తెలీదు. ఎవరెటువంటి పుట్టుకో తెలీదు" అని ఛీదరించుకుంది.

ప్రమీల మాటలు జగన్నాథానికి కష్టం కలిగించాయి. చదువుకుని కూడా తన భార్య ఎంత మూర్ఖంగా మాట్లాడుతోంది. పసివాళ్లు దైవస్వరూపులు. దేవుడికి కులం వుంటుందా? శరణాలయాల్లో ఆకలి దెబ్బల మధ్య నలిగిపోతున్న ఒక అనాథకైనా ఆశ్రయం కల్పిస్తే ఎంత బాగుంటుంది అనుకున్నాడు.

కాని భార్యకు ఎదురు చెప్పలేకపోయాడు. తనలో లోపం వుందని తెలిసినప్పట్నించీ ఏ విషయాల్లోనూ ప్రమీలకు అడ్డుచెప్పడం లేదు.

"సరే నీ ఇష్టం నువ్వు ఎవర్ని పెంచుకున్నా నాకు సమ్మతమే"

మన బంధువుల్లో తగిన పిల్లలు ఎవరైనా వున్నారేమో చూడాలి అంది!

జగన్నాథం మాట్లాడలేదు!

* * *

అప్పటినుండీ ప్రమీల తమ బంధువులలో ఏవరికి ఎంతమంది పిల్లలున్నారో వాళ్ల అందచందాలు గుణగణాలు సేకరించసాగింది!

ఆమెకు బంధువుల్లో కొంతమంది పిల్లలు నచ్చారు కానీ వాళ్ల తల్లిదండ్రులు ఒప్పుకోలేదు వాళ్లనివ్వడానికి.

"ప్రమీలా అందర్నీ అడిగి భంగపడకు! చెట్టుకు కాయ భారం కాదు మరీ లేనివాళ్లయితేనే పిల్లల్ని ఇవ్వడానికి కొంచెం ఇష్టపడొచ్చు! అటువంటి వాళ్లెవరైనా వుంటే చూడు జగన్నాథం సలహా ఇచ్చాడు.

ప్రమీల ఆ సలహా పాటించింది. చివరకు ఒక స్నేహితురాలి ద్వారా ఆమె కోరిక నెరవేరింది. వాళ్లు ప్రమీలకు దూరపు బంధువులు. వాళ్లకు ముగ్గురు అమ్మాయిలు ఇద్దరబ్బాయిలు.

ప్రమీల తన స్నేహితురాలితో కలిసి ఆ వూరు వెళ్లింది.

ఆ పిల్లల తల్లి శాంతమ్మ సాదరంగా ఆహ్వానించింది.

మగపిల్లల్లో రెండోవాడు రవి. ఆరేళ్లుంటాయి. సన్నగా ఎర్రగా వున్నాడు ప్రమీలని ఆ కుర్రాడు బాగా ఆకర్షించాడు!

తను అక్కడున్న రెండ్రోజుల్లోనూ అతడిని మచ్చిక చేసుకోడానికి ప్రయత్నించింది.

"రవీ! మనం బజారువెళ్లి బోల్డు బొమ్మలు కొనుక్కుందాం" అంటూ వాడిని తీసుకెళ్లింది.

"నాకు క్రికెట్ బ్యాట్ కావాలి ఆంటీ" రవి వుత్సాహంగా తనకు కావలసినవి కొనిపించుకున్నాడు.

"రవీ నువ్వు నాతో కలిసి మావూరు వస్తే నీకింకా ఎన్నో బొమ్మలు కొంటాను, చాక్లెట్లు, బిస్కట్లు కొంటాను"

"మరి అమ్మ వస్తుందా?" చక్రాల్లాంటి కళ్లు తిప్పుతూ అడిగాడు.

ప్రమీల దెబ్బతిన్నట్లు చూసింది. కాపీ వెంటనే సర్దుకుంది. పిల్లలకు తల్లిపై ప్రేమ వుండడం సహజం దానికి తను బాధపడటం దేనికి! తను తల్లిని మరిపించాలి. తన పెంపకంలో అతడు తల్లిని మర్చిపోవాలి" అనుకుంది ప్రమీల!

* * *

ఆ రాత్రి అసలు విషయం మాట్లాడుకున్నారు.

"యాభైవేలు ఇస్తేగానీ రవిని ఇవ్వను" శాంతమ్మ ఖచ్చితంగా చెప్పింది. అది విని ప్రమీలకు మూర్ఛబోయినంత పనయింది. యాభైవేలా! ఎక్కడినుండి తెచ్చేది! ఈవిడ ఒక్కసారే తన దరిద్రం అంతా తీరిపోవాలను కుంటోంది.

"యాభైవేలే! మావల్లకాదు"

"నేనడిగింది ఇంకా తక్కువే! వీడు పెరిగి పెద్దవాడైతే లక్షల్లో ఇస్తారు కట్నం" అంది శాంతమ్మ రవిని పెంచుకోడానికి ఇవ్వడం వలన తనెంతో నష్టపోతున్నానని. ప్రమీల ముందుముందు ఎంతో లాభం పొందుతుందని ఆవిడ చాలా బాధపడిపోతోంది.

కానీ ప్రమీల అంత ఇవ్వడానికి సిద్ధంగా లేదు.

"నేను పైసా కూడా తగ్గను" ఆవిడ గట్టిగా చెప్పేసింది. ఇక లాభంలేదని ప్రమీల మూటాముల్లె సర్దుకుని వూరు వెళ్లిపోదామనే ప్రయత్నంలో వుండగా ప్రమీల స్నేహితురాలు మధ్యవర్తిత్వం నెరపి ముప్పైవేలకు రాజీ కుదిర్చింది.

ప్రమీల రవిని తీసుకుని బయలుదేరింది. తల్లిని వదిలి రావడం ఇష్టంలేక బిక్కమొహం వేశాడు రవి.

"అమ్మా! నువ్వూరావే నేను ఒక్కడినీ ఆంటీతో పోను" మారాం చేశాడు.

శాంతమ్మ బతిమిలాడింది.

"రవీ నేను రెండ్రోజుల్లో వస్తాగా నువ్వు ఆంటీతో వెళ్లు ఆంటీ నీక్కావలసిన వన్నీ కొంటుంది!" అంటూ ఎన్నో విధాల నచ్చచెప్పింది.

ఆంటీ కొనిచ్చిన బొమ్మలు బట్టలు చూస్తొంటే రవికి ఆంటీతో వెళ్లాలని వుంది.

**ఆ మాటవిన్న జగన్నాథం చాలా బాధపడ్డాడు. డాక్టరు జగన్నాథాన్ని ఓదార్చాడు. కృత్రిమమైన గర్భధారణకు ఈనాడెన్నో సాధనాలున్నాయని నచ్చచెప్పాడు. కానీ ప్రమీల ఒప్పుకోలేదు...**

కానీ రోజూ తనతో ఆడుకునే చెల్లెళ్ళని ప్రక్కింటి గోపీని వదిలి వెళ్లాలంటే బెంగగా వుంది! కనీసం అమ్మయినా తనతో వస్తే బాగుంటుంది అనుకున్నాడు.

వెళ్లనని ఏడిస్తే తల్లి మానెయ్యమంటుందని ఏడుపు మొదలెట్టాడు.

రవి ఏడుపు జాలికి బదులు కోపాన్ని కలిగించింది శాంతమ్మకు. రవి ఇలా ఏడుస్తూ కూర్చుంటే ప్రమీల వాడిని తీసుకెళ్లదేమో! తనకు రావలసిన ముప్పై వేలు పోతాయేమో! అని శాంతమ్మ బెంగపెట్టుకుంది. అందుకే రవి ఏడుస్తోంటే చిరాకు కలిగిందావిడకు! విసుగెత్తి వాడిని నాలుగు దెబ్బలు వేసింది. అయినా రవి ఏడుపు ఆపలేదు.



శాంతమ్మకు కోపం మరీ ఎక్కువైపోయింది. చీపురుకట్ట పుచ్చుకుని వాడిని ఎడా పెడా కొట్టింది.

"అంటితో వెడతావా? లేదా! నువ్వు వెళ్లకపోతే చంపేస్తాను!" అంది.

రవి ఏడుపు టక్కున ఆపేశాడు! తను ఏడిస్తే తల్లి ప్రేమగా దగ్గరకు తీసుకుని మానెయ్యమంటుం దనుకున్నాడు. కానీ తల్లి కోపంతో కొట్టేసరికి వాడి లేత మనసు గాయపడింది.

తల్లి అంటే అసహ్యం కలిగింది.

తక్షణం అంటితో వెళ్లిపోవాలనుకున్నాడు. ప్రమీల వచ్చి "రవీ వెడదామా" అనగానే బయలుదేరాడు!

* * *

"ప్రమీలా కుర్రాడు బాగున్నాడు. చాలా చురుగ్గా వున్నాడు" జగన్నాథం మెచ్చుకున్నాడు. ప్రమీల గర్వపడింది.

మీరు అనాథ పిల్లలని తెచ్చుకుందామన్నారుగా! చూడండి ఎంత చక్కని కుర్రాడిని ఏరితెచ్చానో" అంది.

ప్రమీలా కుర్రాడిని పెంచుకోడానికి తెచ్చుకోగానే బాధ్యత తీరలేదు. రవి మరీ పసివాడు కాదు కాబట్టి వాడికి తల్లిదండ్రులపై బెంగవుంటుంది. నువ్వు వాడిని మరిపించాలి. ఆ తర్వాత మన దారిలోకి తెచ్చుకోవాలి నువ్వు వాళ్ల ప్రస్తావన ఎన్నడూ వాడి దగ్గర తీసుకురాకు. వాడు ఏదడిగినా కొని పెట్టు విసుక్కోకు!

స్టూడెంటుకి పాఠం చెప్పినట్లు చెప్పాడు. ప్రమీల బుద్ధిగా వింది.

"ప్రమీలా ఇదివరకులా కాదు ఈ నాడు పిల్లలు పుట్టుకతోనే ఎన్నో తెలివితేటల్ని సంతరించుకుంటున్నారు. ఆ వయసులోని పిల్లలు చుట్టూ వున్న విషయాల్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. వారికి ఎన్నో సందేహాలు కలుగుతుంటాయి! వాళ్ల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి. ఈ వయసులో ఏర్పడే అనుభవాల ప్రభావం తరువాతి జీవితం మీద చాలా వుంటుంది. చాలా జాగ్రత్తగా వుండాలి! వాడి ప్రతిచేష్ట వెయ్యికళ్లతో కనిపెడుతూ వుండాలి"

ఇలా ఇంకా చెప్పేవాడే కానీ ప్రమీల బద్ధకంగా ఆవలిస్తుండటం చూసి ఆపేశాడు!

* * *

జగన్నాథం రవిని స్కూల్లో చేర్పించాడు. క్రొత్త స్కూలు క్రొత్త స్నేహితుల మధ్య తల్లిదండ్రుల్ని కొద్దికొద్దిగా మర్చిపోతున్నాడు రవి.

ఉదయమే లేచి తయారయి రిక్షాలో స్కూలుకి వెడుతున్నాడు. స్కూల్లో ఆడుతూ, పాడుతూ చదువుకోవడం ఇంటికి రాగానే సినిమాకో షికారుకో వెళ్లడం లేకపోతే టి.వి చూడటం వీటి మధ్య రవికి రోజు క్షణంలా గడిచిపోసాగింది.

రవి విషయంలో ఇక నిశ్చింతగా వుండొచ్చని జగన్నాథం అనుకుంటుండగా ఆ ఇంట్లో ఒక పెద్ద భూకంపం చెలరేగింది.

ఆ భూకంపం శాంతమ్మ రూపంలో వచ్చింది. ప్రమీలకు ఆవిడరాక ఏ మాత్రం ఆనందాన్ని కలిగించలేదు. కానీ మర్యాదకి నవ్వుతూ ఆహ్వానించింది.

ఆ సాయంత్రం శాంతమ్మ తన రాకలోని ఆంతర్యాన్ని బయటపెట్టింది!

"రవిని నాతో తీసుకెడుతున్నా".

బాంబు పేలింది.

ప్రమీలకు నోటమాటరాలేదు. చాలాసేపటివరకూ ఆ షాక్ నుండి తేరుకోలేకపోయింది.

"నిజంగానా" అంది చెలచెంబోతూ అవును ఇదిగో మీరిచ్చిన డబ్బు. ఇది తీసుకుని నా కొడుకుని నా కిచ్చెయ్యండి తీసుకుపోతాను" అంది.

ప్రమీలకేం చెప్పాలో తోచలేదు.

శాంతమ్మ మీద గొంతువరకూ కోపం వచ్చింది!

"ఆ నాడు మనస్ఫూర్తిగా రవిని ఇవ్వడానికి ఒప్పుకుంది. ఇప్పుడు వచ్చి మళ్లీ ఎందుకు తీసుకువెడుతుందో బొత్తిగా అర్థం కాలేదు ప్రమీలకు!

"మీరిలా మధ్యలో వచ్చి మోసం చేస్తారనుకోలేదు" అంది కోపాన్ని అణచుకుంటూ!

"నా ఇష్టం రవి నా కొడుకు"

ప్రమీలకు మండిపోయింది.

"వాడిని నేనివ్వను" అంది ప్రమీల. ఎదురుచూడని ఆ జవాబుకు శాంతమ్మ తల్లడిల్లిపోయింది. మరుక్షణం ఆవిడా లేచిపోయింది.

ఇద్దరూ వాదించుకున్నారు.

"బలవంతంగా తీసుకెడితే పోలీసురిపోర్టిస్తా" ప్రమీల బెదిరించింది.

"నువ్వేమైనా చేసుకో నేను మాత్రం రవిని తీసుకునిగానీ వెళ్లను" తెగేసి చెప్పేసింది శాంతమ్మ.

ఆ సాయంత్రం జగన్నాథం కాలేజీనుండి వచ్చేవరకూ ఇద్దరూ పోట్లాడుకుంటూనే వున్నారు.

జగన్నాథం అసలు విషయం తెలుసుకుని మనసులో బాధపడ్డాడు. తనకూ వాడికీ ఋణం తీరిందనుకున్నాడు.

"ప్రమీలా గొడవెందుకు ఇచ్చెయ్ వాడిని" అన్నాడు.

ప్రమీల ఇంతెత్తున లేచింది.

"ఇవ్వడానికి వీల్లేదు అంతా ఆవిడ ఇష్టమేనా! ఇంకొక లాభసాటి బేరమేదో వచ్చివుంటుంది. అందుకే కొడుకు కోసం వచ్చింది ఆవిడ. అడగ్గానే ఇవ్వడానికి నేనంత పిచ్చిదాన్నా! వాడిని ముప్పైవేలు పోసి కొన్నాను. ఇన్నాళ్లూ వాడి తిండికీ, బట్టలకూ ఎంతో ఖర్చుపెట్టాం. ఆ డబ్బంతా ఎవడిస్తాడు! మరో పాతికవేలిమ్మనండి వాడిని ఇస్తాను"

ఆవిడ ఎలాగూ ఇవ్వలేదనే ధీమాతో అంది.

శాంతమ్మ దిగులుగా అంది

"అంత డబ్బు నా దగ్గర ఎక్కడుంది? అయినా డబ్బుంటే వాడిని అమ్ముకుంటానా?"

జగన్నాథానికి ఏం చెప్పాలో తోచలేదు. ఆవిడ రవిని ఇస్తేగాని వెళ్లదు! ప్రమీల ఇవ్వదు.

ఈ సమస్య ఎలా తీరుతుంది.

మరో నాలుగురోజులపాటు వారిద్దరి మధ్య హోరాహోరీగా పోట్లాట సాగింది!

జగన్నాథం వీరిద్దరి వాదనలు వింటూ ఇద్దరికీ సర్దిచెప్తూ నలిగిపోతున్నాడు వాళ్లమధ్య.

కానీ ఆ ముగ్గురూ మరో వ్యక్తిని మర్చిపోయారు అతడు రవి!

రవి మనిషే కానీ వస్తువు కాదు. వాడు చిన్నవాడే కావచ్చు. కానీ వాడికీ జ్ఞానం వచ్చింది. పరిస్థితులను అర్థం చేసుకునే తెలివితేటలు వున్నాయి. తన తల్లి వచ్చినప్పటి నుండీ ఆ ఇంట్లో జరుగుతున్న విషయాలు మౌనంగా వింటూనే వున్నాడు. అర్థం చేసుకుంటూనే వున్నాడు. వాడికెందుకో బాగా ఏడుపు వస్తోంది.

ఆ వారం రోజులూ వాడిని పట్టించుకునే వాళ్ళేలేరు. ఎవరికి వారు వాడిమీద తామే అధికారం సంపాదించాలని ఆ పోరాటంలో గెలవాలని తాపత్రయపడుతున్నారు.

రవెవ్వరికీ అక్కర్లేదు.

తనతో ఎవ్వరూ ప్రేమగా మాట్లాడడం లేదు. అందరూ ఏదో డబ్బు గురించే మాట్లాడుకుంటున్నారు. తనని పిల్చి ఒక్కరూ అన్నం పెట్టడం లేదు. ఆకలితో తను చచ్చినా ఫర్వాలేదేమో! డబ్బు వుంటే చాలు వాళ్లకు.

అనుకుంటూ రవి ఏడుస్తున్నాడు.

ఏడుస్తున్న అతని మనస్సులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

* * *

శాంతమ్మ నిరాహారదీక్ష ప్రారంభించింది. కొడుకుని తనతో పంపేవరకూ తిండీ, నీళ్లూ ముట్టుకోనని శపథం చేసింది.

ప్రమీల మొండిగా వుండిపోయింది. కానీ జగన్నాథం కంగారుపడ్డాడు.

తన ఇంట్లో చచ్చిపోతుందేమోనని భయపడ్డాడు.

ఆవిడ దగ్గరకు వెళ్లి నచ్చచెప్పాడు.

"చూడండి మనలో మనకెందుకీ గొడవలు రవి కూడా చిన్నవాడు కాదు. వాడిని పిలిచి అడుగుదాం. వాడికి ఎక్కడ బాగుంటే అక్కడ వుంటాడు! మీ ఇద్దరిలో ఎవరంటే ఇష్టమైతే వాళ్లదగ్గరికి వస్తాడు సరేనా" అన్నాడు.

శాంతమ్మ ఆ ఆలోచనకు చాలా ఆనందించింది. రవి తన కొడుకు తను నవమాసాలు మోసి కన్న తల్లి కొడుకు తన నెన్నడూ కాదనడు రక్తసంబంధం ఎక్కడికి పోతుంది అనుకుంది.

ప్రమీల కూడా దీనికి అంగీకరించింది.

రవికి తనెన్ని వస్తువులు కొనిపెట్టింది. వాడికేలోటూ కలిగించలేదు. వాడికి ఎన్నో సౌకర్యాలు అమర్చింది. ఎన్నో బట్టలు కొనిచ్చింది. మంచి తిండి పెడుతోంది ఆ సుఖాలు వదులుకొని వాడు ఆ దరిద్రంలోకి ఎన్నడూ పోడు. ఆ నమ్మకం తనకుంది అనుకుంటూ ధైర్యంగా వుంది.

జగన్నాథం రవిని పిలిచాడు.

"రవీ నిన్ను పెంచుకోవాలని మేం అనుకుని తెచ్చుకున్నాం. ఇన్నాళ్లూ నిన్ను ఆ వుద్దేశ్యంతోనే పెంచాం ఇప్పుడు మీ అమ్మవచ్చి నిన్ను మళ్లీ తన ఇంటికి తీసుకుపోతానంటోంది నీకు ఏ అమ్మ కావాలో తేల్చుకుని అక్కడకు వెళ్లు" అన్నాడు.

రవి ఆ ఇద్దరు 'అమ్మ'ల వేపు చూశాడు. ఒకవేపు తన కన్నతల్లి మరొక వేపు తనని పెంచుకోవాలనుకున్న తల్లి.

రవి కళ్లముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నాయి!

తను ఏదడిగినా విసుక్కుంటూ కొనిచ్చే పెంపుడుతల్లి ఒక ప్రక్క.

'రవీ నాకు నీవల్ల ముప్పై వేలు వచ్చాయిరా' అని ఆనాడు మురిసిపోయి మళ్లీ ఇప్పుడు ఇంకో లాభసాటి బేరానికి అమ్మాలనుకుంటున్న కన్నతల్లి.

'అమ్మా' అని పిలుస్తావా లేదా అని బెల్టుతో రక్తం కారేట్లు కొట్టిన పెంపుడు తల్లి ఒక ప్రక్క.

అంటేతో వెళ్లకపోతే చంపేస్తాను అంటూ చీపురుతో బాదేసిన కన్నతల్లి ఒక ప్రక్క.

ఇద్దరూ చేతులు చాచి ఆప్యాయంగా తనని పిలుస్తున్నారు.

వాడికి చెప్పరాని భయం వేసింది.

"అంకుల్ నాకు వీళ్లిద్దరూ అక్కర్లేదు. నేను ఎవరి దగ్గరకూ వెళ్లను. మా కాన్వెంటు స్కూలు ఫాదర్ ఫ్రాన్సిస్ దగ్గర వుంటాను. ఆయనకు నేనంటే చాలా ఇష్టం. నన్నెంతో ప్రేమగా చూస్తాడు. నేను ఆ ఫాదర్ దగ్గరకే పోతున్నాను. ఇంకెప్పుడూ ఇక్కడికి రాను నాకు మీరంటే అసహ్యం" అంటూ బయటకు పరిగెట్టిపోయాడు రవి!

